కథ

# కలుపు మొక్క

సి.ఎన్.చంద్రశేఖర్

**అజయ్‌గారికి, నమస్తే. ఈవారం 'చిరుజల్లు' వారపత్రికలో ప్రచురింపబడిన మీ 'మనిషితనం' కథ చదివాను. కథ చాలాబాగుంది. నాకు ఎంతగానో నచ్చింది. తాను ప్రాణప్రదంగా ప్రేమించిన భార్య ప్రమాదంలో అవిటిదైపోతే ఆ లోటు తెలియనివ్వకుండా ఆమెకు భర్త అన్ని సేవలూ చేస్తూ తాను మనిషినని ఋజువు చేసుకోవడం చాలా హృద్యంగా రాశారు. మానవత్వం మృగ్యమైపోతున్న ఈ రోజుల్లో ప్రతి మనిషిలో మానవత్వం తట్టిలేపేలా రాశారు.**

మీరు వ్రాసిన కథలన్నీ చదివాను నేను. ఈ పత్రికలో మీ చిరునామా యివ్వడం వల్ల మీకు ఉత్తరం రాస్తున్నాను. మీ రచనాశైలి, మంచి ఇతివృత్తాలు, అద్భుతమైన సంభాషణలు నన్ను మీ అభిమానిని చేశాయి. మీరు యింకా ఎన్నో రచనలు చేసి గొప్ప రచయితగా గుర్తింపబడాలని నా కోరిక.

మీరు బిజీగా ఉంటారని, నాకు ఉత్తరం రాసేంత తీరిక మీకు ఉండదని తెలుసు కనుక నా అడ్రసు యివ్వడం లేదు. నన్ను పలకరించాలనిపిస్తే నాకు ఫోన్ చెయ్యండి. నా ఫోన్ నెంబరు ఉత్తరం చివర రాస్తున్నాను. ఉంటాను. మీ అభిమాని- పద్మజ.

ఉత్తరం చదవడం ముగించిన అజయ్ ఆ ఉత్తరాన్ని 'అభిమానుల ఉత్తరాలు' అని రాసి ఉన్న ఫైల్‌లో పెట్టాడు.

* * *

ఫోన్ మ్రోగుతుంటే రిసీవర్ తీసి "హలో" అంది పద్మజ.

"హలో..పద్మజగారేనా?"

"అవును. మీరు?"

"పలకరించమన్నారుగా"

"అజయ్‌గారా?" ఆమె గొంతులో ఎగ్జయింట్‌మెంట్.

"అవును"

"వాట్ ఎ సర్‌ప్రైజ్. థాంక్యూ. థాంక్యూ వెరీమచ్" అంది.

"విజయవాడలో ఉంటున్నారా మీరు?"

"ఉత్తరం మీది పోస్టల్ వాళ్ళ ముద్ర చూసి కనుక్కున్నారా?"

"కాదు. మీ ఫోన్ నెంబరుతో పాటు ఎస్.టి.డి కోడ్ కూడా రాశారుగా"

"టెలిఫోన్ డైరక్టరీ చూశారా?"

"ఆ అవసరం లేదు. విజయవాడకు తరచూ వస్తూంటాను. ఫోన్లు చేస్తూంటాను. చాలామంది మిత్రులున్నారు నాకు మీ ఊరిలో"

"అయితే మా ఊరు ఎప్పుడొస్తున్నారు?"

"ఈ నెల పదిహేనున ఓ సాహితీ సభ ఉంది."

"వెరీగుడ్. మీ ఆవిడతో పాటు వస్తున్నారా?"

"నాకంత అదృష్టం లేదు"

"ఏం. మీకింకా పెళ్ళికాలేదా?"

"అయింది. ఇష్టంలేని పెళ్ళి. మా భావాలూ, అభిరుచులూ కలవలేదు"

"మీరు కలిసి ఉండటం లేదా?"

"కలిసి ఉంటున్నాం. కలసి మెలసి ఉండటం లేదు"

"ఐయామ్ సారీ"

"ఫర్వాలేదు. మీరు ఉత్తరం చాలాబాగా రాశారు"

"థాంక్యూ. అయినా మీకంటే బాగా రాయలేనులెండి. విజయవాడ వస్తే ఎక్కడ ఉంటారు?"

"హోటల్ గదిలో"

"మరి నేను మిమ్మల్ని ఎక్కడ కలవను?"

"మీటింగ్ హాలుకు రండి"

"ఎక్కడ మీటింగ్?"

అజయ్ చెప్పాడు.

* * *

పద్మజ సాయంత్రం ఆరుగంటలకు మీటింగ్ హాల్ చేరుకుంది. అప్పటికే సభ ప్రారంభమయి వక్తలు మాట్లాడుతున్నారు. పద్మజ ఓ కుర్చీలో కూర్చుని ఉపన్యాసాలు వింటూ, అజయ్ మాట్లాడటానికి లేవగానే మరింత ఆసక్తిగా అతన్ని చూస్తూ, అతని ఉపన్యాసం వినసాగింది. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు తల్లితండ్రుల బాధ్యత ఎటువంటిదో చక్కగా చెప్పాడు అజయ్.

రాత్రి ఎనిమిది గంటలకు సభ పూర్తయింది.

సభ నిర్వాహకుల దగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చిన అజయ్‌ని పద్మజ పలుకరించింది.

"నమస్తే. నేను పద్మజని"

"హలో" అంటూ పద్మజని చూశాడు అజయ్. చూశాక కళ్ళు త్రిప్పుకోలేకపోయాడు. ఆమె చాలా అందంగా ఉంది.

"నేనెవరో గుర్తు రాలేదా?"

"గుర్తొచ్చారు. ఎప్పుడొచ్చారు మీరు?"

"సభ ప్రారంభమయ్యాక వచ్చాను. మీ స్పీచ్ చాలా బాగుంది"

"అలాగా రండి. నడుస్తూ మాట్లాడుకుందాము"

ఇద్దరూ నడుస్తూ మాట్లాడుకోసాగారు.

"మీరు భోం చేశారా?" ఉన్నట్టుండి అజయ్ అడిగాడు.

లేదన్నట్టు తల అడ్డంగా ఊపింది పద్మజ.

"పదండి. ముందు భోం చేద్దాం. ఆకలి దంచేస్తూంది"

ఇద్దరూ హోటల్‌లో ప్రవేశించారు. అజయ్ భోజనాలకు ఆర్డర్ చేశాడు.

"తొమ్మిదవుతూంది. మీ యింట్లో ఏం అనరుగా?" అజయ్ అడిగాడు.

"అనడానికి నాకెవరూ లేరు. నా చిన్నతనంలోనే నాన్న పోయారు. నన్నూ, అన్నయ్యనూ ఎన్నో కష్టాలు పడి పెంచింది అమ్మ. అన్నయ్య ఉద్యోగరీత్యా పూనాలో ఉంటున్నాడు. నేను ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాను. గత ఏడాది అమ్మ కూడా పోవడంతో ఓ గది అద్దెకు తీసుకొని నా స్నేహితురాలితో పాటు ఉంటున్నాను"

"ఈమె దుస్తులు, అలంకరణ చూస్తే మధ్యతరగతి, అంతకంటే క్రిందిస్థాయి జీవితాన్నే గడుపుతున్నట్లు తెలుస్తుంది" అనుకున్నాడు అజయ్.

భోజనాలు పూర్తయ్యేవరకు అతని రచనల గురించి, క్రొత్తగా విడుదలైన అతని పుస్తకం గురించి మాట్లాడుకున్నారు.

"ఈరోజు నా జీవితంలో మరపురాని రోజు. ఓ ప్రముఖ రచయితతో కలసి భోజనం చేసే భాగ్యం కలిగింది- అని డైరీలో రాసుకుంటాను" అంది పద్మజ.

"ఓ మంచి స్నేహితుడు దొరికిన రోజు అని రాసుకోరా?"

"డైరీలో రాయబోయే అన్ని విషయాలూ చెప్పేస్తారా ఎవరైనా? ఇంకా చాలా..చాలా..రాసుకుంటాను" అంది నవ్వుతూ.

టైము చూశాడు అజయ్. తొమ్మిదిన్నర.

"రండి. నా గదికి వెళదాం. త్వరలో విడుదల కాబోతున్న నా పుస్తకం మీకు నా కానుకగా యిస్తాను" అంటూ ఆ హోటల్‌లో ఓ చివరగా ఉన్న మెట్ల వైపు నడిచాడు.


"ఈ హోటల్‌లోనేనా మీరు గది తీసుకుంది?" అతన్ని అనుసరిస్తూ అడిగింది.

"అవును. మీటింగ్ హాల్‌కు దగ్గరగా ఉంటుందని యిక్కడ దిగాను"

గదిలోకి వెళ్ళాక ఆమెకు కుర్చీ చూపించి తను మంచంపై కూర్చున్నాడు. సూట్‌కేస్ తెరచి పుస్తకం తీసి దానిపై తన సంతకం చేసి ఆమె కిచ్చాడు.

"థాంక్యూ" అని అపురూపంగా ఆ పుస్తకాన్నే చూస్తూ అందుకుంది.

"పద్మజగారూ. అభిమానం కోసం, కాసింత ఓదార్పు కోసం ఆర్తిగా ఎదురుచూస్తున్న నాకు మీ ఉత్తరం ఎడారిలో ఒయాసిస్సులా ఆశల్ని రేపింది. మండుటెండలో వానజల్లులా ఆహ్లాదాన్నిచ్చింది. ఈరోజు మీతో మాట్లాడుతూంటే ఎన్నో ఏళ్ళ పరిచయం ఉన్న వ్యక్తిలా కనిపిస్తున్నారు. మీతో యింకా చాలా మాట్లాడాలని, నా భావాలు పంచుకోవాలని ఉంది. ఈ రాత్రి యిక్కడే ఉండిపోరాదూ?"



"అదెలా సాధ్యం?" యిబ్బందిగా చూస్తూ అంది.

"ఎందుకు సాధ్యం కాదు? ప్రక్క గది కూడా మనమే తీసుకుందాం. ఓపికున్నంత వరకూ మాట్లాడుకుందాము. ఆ తర్వాత చెరో గదిలో పడుకుందాం."

"వద్దండీ. బాగుండదు. పైగా నేను వెళ్ళక పోతే నా స్నేహితురాలు ఆందోళన పడుతుంది"

"మీ గదికి ఫోనుంది కదా. నా సెల్ నుంచి ఫోన్ చేసి చెప్పండి ఆవిడకు. మీ అభిమాన రచయిత కోరిన చిన్న కోరిక తీర్చరూ?"

"నేను రేపు ఉదయం ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా వస్తాను. రేపు రాత్రి వరకు మీతోనే ఉంటాను" నచ్చచెబుతున్నట్లు అంది.

"రేపు ఉదయం అయిదు గంటలకు చీరాల బయలుదేరుతున్నాను నేను"

పద్మజ మాట్లాడలేదు. మౌనంగా అతనివైపే చూడసాగింది.

"పోనీ ఇంకో గంటసేపు యిక్కడే ఉండండి. తర్వాత నేను ఆటోలో మీ గది వరకూ వచ్చి దిగబెడతాను."

"అలాగే"

తర్వాత యిద్దరూ మాట్లాడుకోసాగారు. అజయ్ తన కాలేజీ రోజుల దగ్గర్నుంచి ఉద్యోగం, పెళ్ళి, రచనా వ్యాసంగం వరకు ఎన్నో విషయాలు ఆమెకు చెప్పాడు. భార్య ప్రవర్తన గురించి చెప్పి బాధపడ్డాడు. పద్మజ అతన్ని ఓదార్చింది.

పదిన్నరకు పద్మజ తను బయలుదేరుతానని చెప్పి లేచింది.

"పదండి. నేనూ వస్తాను" అంటూ లేచాడు అజయ్.

"ఫర్వాలేదు. పదిన్నరేగా టైము. నేను వెళ్ళగలను. మా గది కూడా యిక్కడికి దగ్గరే. ఓకే. బై గుడ్‌నైట్."

"మళ్ళీ ఎప్పుడు?"

"ఈసారి మీరు విజయవాడ వచ్చినప్పుడు"

* * *

హైదరాబాదు వచ్చాక అజయ్ రెండురోజులకోసారి పద్మజతో ఫోనులో మాట్లాడుతూనే ఉన్నాడు. ఆమె అందం, ఆమె మేని ఒంపులు అతనికి మరీ మరీ గుర్తుకు రాసాగాయి. ఆమెను వీలైనంత త్వరగా కలవాలని ఆశగా ఉంది అతనికి. త్వరలోనే అతని కోరిక తీరే అవకాశం వచ్చింది. ఓ వర్ధమాన రచయిత రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి, విశ్లేషించేందుకు అభ్యర్థన, ఆహ్వానం అందింది అతనికి. తను విజయవాడ వస్తున్న విషయం పద్మజకు చెప్పి, ఆ సభకు తప్పకుండా రమ్మన్నాడు ఆమెను.

ఈసారి సభ ప్రారంభం కాకముందే పద్మజ వచ్చినా అజయ్ రాలేదు. అతను వచ్చీరాగానే సభ ప్రారంభమవడంతో అతనితో మాట్లాడే అవకాశం ఆమెకు దొరకలేదు. స్టేజి మీద కూర్చున్నాక పద్మజను చూశాడు అజయ్. కళ్ళతోనే పలుకరించాడమెను. పద్మజ కూడా పలకరింపుగా నవ్వింది. తర్వాత అజయ్ పుస్తకాన్ని ఆవిష్కరించి అందులోని కథల్లోని గొప్పతనాన్ని, రచయిత దృక్పథాన్ని చక్కగా విశ్లేషించి, రచయితను అభినందించాడు.

ఎనిమిది గంటలకు యిద్దరూ బయటకు వచ్చారు.

"ఎక్కడికెళదాం?" అజయ్ అడిగాడు.

"కనకదుర్గ గుడికి వెళదామా?"

"మంచి ఆలోచన. ఇప్పుడే వెళదామా?"

వెళదామన్నట్టు తలూపింది.

ఆటోలో గుడి చేరారు యిద్దరూ. గుడిలో రష్ లేదు. త్వరగానే దుర్గమ్మను దర్శనం చేసుకుని వెలుపలికి వచ్చారు. అజయ్ ఓ అరుగుమీద కూర్చుని పద్మజ కోసం చూశాడు. ఆమె గర్భగుడి వైపు మొహం పెట్టి కళ్ళు మూసుకుని మనసులో ఏదో అనుకుంటూంది. ఆమెనలా చూస్తూంటే ఎంతో ముచ్చటేసింది అతనికి. పద్మజ అందంగా, అమాయకంగా కనిపిస్తూంది. తను యింకొంచెం చొరవ చూపి యీమెని బుట్టలో వేసుకోగ లిగితే తను అదృష్టవంతుడే అనుకున్నాడు మనసులో.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" పద్మజ అతని ఎదురుగా నిలబడి అడిగింది.

"మీ గురించే. హైదరాబాదులో ఉన్న నాకు, విజయ వాడలో ఉన్న మీకు స్నేహం ఎలా కుదిరిందో చూడండి. మిమ్మల్ని నాకు పరిచయం చేసిన నా రచనలకు నేను థాంక్స్ చెప్పాలి."

"అవును" అంటూ నవ్వి అతని ప్రక్కన కూర్చుని "మీరు పుస్తకాన్ని చాలాబాగా విశ్లేషించారు. కాని నాదో చిన్న అనుమానం" అంది.

"ఏమిటో చెప్పండి"

"మీరు ఆ కథల్లోని గొప్పతనాన్ని, రచయిత ప్రతిభను గురించి చెప్పారు. అయితే ఆ రచనల్లోని నెగటివ్ పాయింట్స్‌ని చెప్పలేదు. అతని రచనలలోని లోపా లను, అతను అభివృద్ధి చేసుకోవాల్సిన అంశాల గురించి కూడా చెప్పి ఉంటే అతనికి ఉపయోగకరంగా ఉండేది కదా?"

"మీరు చెప్పింది కరెక్టే. కానీ సభకు వచ్చినవాళ్ళలో చాలామంది రచయిత, స్నేహితులు, బంధువులు, సహోద్యోగులు ఉంటారు. వారి ముందు అతని గౌర వాన్ని నిలపాలంటే నేను పాజిటివ్ పాయింట్స్ మాత్రమే చెప్పాలి. అయితే వేదిక మీద అతని ప్రక్కన కూర్చున్న ప్పుడు అతనికి కొన్ని సలహాలిచ్చాను. అతనూ స్పోర్టి వ్‌గా తీసుకున్నాడు."

అజయ్ వైపు మెచ్చుకోలుగా చూసింది ఆమె.

"వెళదామా?" అజయ్ లేచి అన్నాడు.

"ఎక్కడికి?"

"నా గదికి"

"భోజనం?"

"అక్కడికే తెప్పిద్దాం"

"అయితే పదండి"

ఆటో పెద్ద హోటలు ముందు ఆగింది. ఆటోకు డబ్బులు చెల్లించి పద్మజ వైపు చూశాడు అజయ్. ఆమె హోటల్ వైపు సంశయంగా చూస్తూ నిలబడి ఉంది.

"ఏమిటి నిలబడిపోయారు. రండి వెళదాం"

"నేనెప్పుడూ ఇలాంటి హోటల్స్‌కు ఒంటరిగా రాలేదు"

"ఇప్పుడూ ఒంటరిగా రాలేదు మీరు"

"అఫ్‌కోర్స్" అంటూ నవ్వి ముందుకు కదిలింది.

గదిలోకి భోజనాలు వచ్చాయి. ఇద్దరూ మాట్లాడు కుంటూ భోం చేశారు.

"ఈమధ్య కథలేం రాశారు?" టీపాయ్ మీదున్న అర టిపండు తీసుకుంటూ అడిగింది పద్మజ.

"పెద్దగా రాయలేదు"

"ఎందువల్ల?"

"మనసు మనసులో లేదు"

"ఎక్కడికెళ్ళింది మీ మనసు" నవ్వుతూ అడిగింది.

"మీ దగ్గరికి"

అర్థం కానట్లు చూసింది అతనివైపు.

"అవును పద్మజగారూ. నా మనసు ప్రతి నిమిషం మీ గురించే ఆలోచిస్తూంటుంది. ఎప్పుడూ మీరు నా ఎదు రుగానే ఉంటే బాగుండునని అనిపిస్తూంది. నేనెందు కలా అవుతున్నానో నాకే అర్థం కావడం లేదు. ఇంతవ రకూ పరాయి ఆడదాన్ని మరో దృష్టితో చూడని నేను మిమ్మల్ని చూడగానే ఎంతో అలజడికి గురయ్యాను. మీతో మాట్లాడుతూంటే ఓ ఆత్మీయురాలితో మాట్లాడు తున్నట్లు, నేను కోల్పోయినవి మళ్ళీ నాకు దొరికినట్లు ఫీలయ్యాను. ఐ లవ్ యు పద్మజగారూ...ఐ లవ్ యూ"

"అదెలా సాధ్యం. మీరు వివాహితులు. మీ భార్యకు విడాకులు యివ్వగలరా?"

"ఆమె ఒప్పుకోదు"

"రెండో పెళ్ళి చట్టరీత్యా నేరం కదా"

"మనం యీ పెళ్ళి, చట్టం, లోకం..వీటన్నిటికీ అతీ తంగా ప్రేమికులుగా బ్రతకలేమా?"

"బ్రతకవచ్చు. కానీ అంత అవసరమేమొచ్చింది?"

ఈసారి అజయ్ అర్థం కానట్లు చూశాడామె వైపు.

"ఇరవయ్యేళ్ళ వయసున్న నేను ముప్పై ఐదు ఏళ్ళు దాటిన వ్యక్తిని ఎందుకు ప్రేమించాలి? అదీ పెళ్ళయిన వ్యక్తిని. నాకూ భర్త, పిల్లలు కావాలని ఉండదా? పోనీ వయసు, పెళ్ళి అన్నీ మరచి ప్రేమిం చుదామన్నా అందంలో మీరు నలకూబరులు కాదే? ఆస్తిలో అంబానీ వారసులు కాదు. ఏం చూసి ప్రేమించాలి మిమ్మల్ని?"

ఛెళ్ళున చెంప మీద చరిచినట్లు ఫీల య్యాడు అజయ్.

"నేను పేరున్న రచ యితను. అది చాలదా ప్రేమించ డానికి?" రోషంగా అన్నాడు.

"అయితే ఏం? రచ యిత అయితే ప్రేమిం చెయ్యాలా?"



## అపహరిస్తుందా?

ప్రకాష్ ఝా ప్రొడక్షన్స్ కొత్త చిత్రం 'అపహరణ్'లో బిపాషా డిఫరెంట్‌గా కన్పిస్తుందంటున్నారు. సతారా, పూనెల్లో షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రంలో అజయ్ దేవ్ గన్, ముఖేష్ తివారీ, ఆయూబ్‌ఖాన్, చేతన్ పండిట్ తదిత రులు నటిస్తున్నారు. పాట మినహా ఈ చిత్రం షూటింగ్ పూర్త యిందంటున్నారు. తన అందంతో ఎంతమంది హృద యాల్ని అపహరిస్తుందో చూడాలి మరి!

"మరెందుకు నేను రమ్మన్న చోటికల్లా వచ్చి అర్ధరాత్రి వరకూ నాతో గడిపారు?"

"ఎందుకంటే నాకు మీ రచనలంటే యిష్టం కనక. వాటిని రాసిన మీరంటే కూడా యిష్టం కనుక."

"ఇష్టం వేరు, ప్రేమ వేరు అంటారా?"

"కాదా? రచయితలు మీరే అలా అడిగితే ఏం చెప్పను? నాకు టెండూల్కర్ అంటే ఎంతో యిష్టం. ఎందుకంటే అతను అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడు కనుక. బాలు అంటే యిష్టం, చక్కగా పాడతాడు కనుక. హర్షాబొగ్లే అంటే యిష్టం, నాన్‌స్టాప్‌గా ఆంగ్లంలో కామెంటరీ చెబుతాడు కనుక. అంతమాత్రాన వాళ్ళను ప్రేమించానంటూ వెంటపడమంటారా?"

"అలా వెంటపడేవాళ్ళు లేరంటారా? సినీ హీరోతో 'స్వయంవరం' అని ఓ టీవీ ఛానల్ ప్రకటిస్తే వందల కొద్దీ అమ్మాయిలు ఆ హీరోతో మాట్లాడటానికి, డాన్స్ చేయడానికి పోటీలు పడ్డారు తెలుసా?"

"అది వాళ్ళ యిష్టం. అటువంటివాళ్ళపై జాలి చూపడం తప్ప నేనేం చేయలేను. భారత స్త్రీ చేయి పట్టుకున్నా, సప్తపదులు నడిచినా, డాన్స్ చేసినా అది తన భర్తతో మాత్రమే చేస్తుంది. వృత్తిరీత్యా సినిమాల్లో నటించే హీరోయిన్ల విషయం వదిలెయ్యండి. మన సాంప్రదాయం, మన కట్టుబాట్లు, నైతిక విలువలు చూసి విదేశీయులే ఆశ్చర్యపడి, మన మార్గాన్ని అనుసరిస్తుంటే మనం దారి తప్పడం క్షమించరాని నేరం. ఇవన్నీ మీ కథల్లో మీరు చెప్పారు కూడా."

అజయ్ ఏం మాట్లాడలేదు.

"దయచేసి ఈ అనవసరమైన ఆలోచనలు, సంఘర్షణలు వదిలెయ్యండి. హైదరాబాదులో ఓ ఫంక్షన్‌లో మీ శ్రీమతిని చూశాను నేను. ఎంతో అందంగా ఉన్నారు ఆవిడ. చక్కని సంసారం ఉంది. మంచి ఉద్యోగం ఉంది. సాహిత్యంలో అంతో యింతో సాధించారు. ఇంకా సాధించవలసింది ఎంతో ఉంది. ఇటువంటి సమయంలో యిలా వృధా ఆలోచనలు చేసి మీ భవిష్యత్తు పాడుచేసుకోకండి. నాతో పరిచయమయ్యాక రాయలేకపోతున్నానని మీరే అన్నారు. అంతే కాదు. ఇటువంటి వ్యామోహాల వల్ల పేరూ, పరువూ పోగొట్టుకున్న రచయితలూ, సినీనటులూ ఉన్నారు. ఆ లిస్టులో మీరు చేరకండి."

కొంతసేపు యిద్దరూ మౌనంగా ఉండిపోయారు.

తర్వాత పద్మజ అంది. "తోటి రచయిత గౌరవం నిలపాలన్న సంస్కారం ఉన్న మీరు, అర్ధరాత్రి వరకు మీతో ఉన్నా కనీసం నా చెయ్యి కూడా పట్టుకోని మీరు పరాయి అమ్మాయితో ప్రేమాయణాలూ, సరస సల్లాపాలూ సాగించలేరు. ధైర్యం లేదని కాదు. నైతికంగా దిగజారడం మీవల్ల కాదు. మీ మనసులో మీకే తెలియకుండా ఓ కలుపుమొక్క పెరుగుతుంది. దాన్ని తీసి పారేయండి. మరింత ఆరోగ్యవంతమైన రచనలు చేస్తారు మీరు. ఈ అభిమాని చిరకాలం మీ అభిమానిగా ఉంటుంది."

అజయ్ ఆశ్చర్యంగా చూశాడామె వైపు. అమాయకంగా కనిపించే పద్మజ అంత బాగా మాట్లాడగలదని, తన మనసులోని భావాల్ని విశ్లేషించగలదని ఊహించలేదు అతను.

"నాపై మీకున్న అభిమానాన్ని, శ్రద్ధను చూశాక నన్ను క్షమించమని అడగడానికి సిగ్గుపడటం లేదు. నేను మీరన్నట్లు నా భార్య అందగత్తే. అంతే కాదు. మంచి వ్యక్తి కూడా.

కాకపోతే ఎప్పుడూ పిల్లలు, పనులు అని బిజీగా ఉంటూ, నాలోని సున్నితమైన భావాల్ని పంచుకునే తీరిక, ఓపిక ఆమెకు లేకపోవడంతో కొంత గ్యాప్ ఫీలై, ఆ గ్యాప్ భర్తీ చేసుకోవడం కోసం యిలా ప్రవర్తించాను. ఐ సిన్సియర్లీ రిగ్రెట్ ఫర్ వాట్ ఐ హావ్ డన్" అన్నాడు బాధగా.

అతని మొహంలో పశ్చాత్తాపం కనబడింది ఆమెకు.

"నా మాటలు మీరు పాజిటివ్‌గా తీసుకోవడం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తుంది. సక్సెస్‌ఫుల్ రచయితగా పేరు తెచ్చుకుంటున్న మీరు ఎప్పుడూ తలెత్తి నిలబడాలేగాని తల దించుకునే పరిస్థితి రాకూడదని నా తపన. బాధ్యత గల రచయితగా పేరు తెచ్చుకున్న మీరు బాధ్యతెరిగిన మనిషిగా కూడా ప్రవర్తించాలని నా కోరిక.

ఇప్పుడు నా మనసులోని ఆందోళనలన్నీ మాయమయ్యాయి. ఒకవేళ నిజంగా ఓ అమ్మాయి మీ అభిమాననని, మిమ్మల్ని ప్రేమిస్తున్నానని మీ వెంట పడినా మీరు ఆమెకు నచ్చచెప్పి సరిదిద్ది పంపిస్తారనే నమ్మకం కలిగింది నాకు. నేను వెళ్ళొస్తాను. మీ ఆలోచనల్లో మార్పు రావడం కోసమే నేను కాస్త అవమానకరంగా మాట్లాడాను. నన్ను క్షమించండి."

ఫర్వాలేదన్నట్టు నవ్వాడు అజయ్.

"మీ ఆతిథ్యానికి థాంక్స్. ఈసారి మీ శ్రీమతితో రండి. సరదాగా గడుపుదాం బై"

"బై"

* * *

"మేడమ్ మీకోసం సులక్షణ అని ఓ ఆవిడ వచ్చారు" తన క్లినిక్‌లో కన్సల్టింగ్ రూంలో కూర్చుని ఉన్న పద్మజతో నర్స్ చెప్పింది.

"లోపలికి పంపించు"

సులక్షణ లోపలికి రాగానే పద్మజ చేయందుకుని "థాంక్యూ పద్మజా. నువ్వు ఏం మంత్రం వేశావోగాని ఆయనలో చాలా మార్పొచ్చింది. ఇప్పుడు అమ్మాయిల గురించి మాట్లాడి నాకు తలనొప్పి తెప్పించడం లేదు. రచనల గురించి తప్ప అమ్మాయిల గురించి ఆలోచించడం లేదు. నాకెంత ఆనందంగా ఉందో తెలుసా?" అంది.

"నాకు మాత్రం బాధగా ఉందక్కా." అంది పద్మజ.

ఎందుకన్నట్లు చూసింది సులక్షణ.

"నీ భర్త ఈమధ్య నీతో యిదివరకులా లేడని, ఎప్పుడూ తన అభిమానుల గురించి చెబుతూ నిన్ను చిరాకు పరుస్తున్నాడనీ, ఆ ఆలోచనల వల్ల రచనలు కూడా సరిగ్గా చెయ్యలేకపోతున్నాడనీ చెప్పావు. ఓ సైకాలజిస్ట్‌గా, నీ ప్రాణ స్నేహితురాలి చెల్లెలుగా నాకు చేతనయినంత సహాయం నీకు చెయ్యాలని చేశాను. కానీ నువ్వు అతను చేస్తున్న తప్పుల గురించి చెప్పావే తప్ప నువ్వు చేస్తున్న తప్పుల గురించి చెప్పలేదు."

"నేనేం చేశాను?"

"ఏమీ చెయ్యడం లేదనే నా బాధ. ఓ భార్యగా అతనికి ప్రోత్సాహం యివ్వడం, అతని ఆలోచనలూ భావాలూ పంచుకోవడం, కాస్త సరసంగా ప్రవర్తించడం యిలాంటివన్నీ భార్య తప్పనిసరిగా చేయాల్సిన పనులు. అదీ మొక్కుబడిగా కాకుండా యిష్టంతో చెయ్యాలి. అతను అంతగా పరాయి ఆడదాని స్నేహం కోసం, ఓదార్పు కోసం తపించిపోయాడంటే తప్పు నీలోనే ఉంది. పిల్లలు, పనులు యివన్నీ ఆడదానికి తప్పనిసరి. వీటన్నిటితోపాటు శృంగారం, భర్త సంతోషం గురించి కూడా ఆలోచించాలి. అప్పుడే ఆ సంసారం నిలబడుతుంది" అంది పద్మజ.

"సారీ పద్మజా. నీవు చెప్పేవరకూ నేను చేస్తున్న తప్పేమిటో నాకు తెలియలేదు. ఇన్నిరోజులూ ఆయనలో తప్పుల్నే వెతికాను. ఇక నా తప్పు సరిదిద్దుకుంటాను. నీవు నాకోసం నీ అమూల్యమైన సమయం వెచ్చించావు. నీకు కృతజ్ఞతలు చెప్పడంతో పాటు నీ ఫీజు కూడా చెల్లించడం నా బాధ్యత" అంటూ పర్సు తెరిచింది సులక్షణ.

"నీ ఫీజు నాకెప్పుడో అందింది"

"ఎప్పుడు?" ఆశ్చర్యంగా అడిగింది సులక్షణ.

"సాహిత్యాన్ని ఎంతో అభిమానించే నన్ను ఓ ప్రముఖ రచయితకు స్నేహితురాల్ని చేశావు. నీ ఫీజు ఆ రూపంలో చెల్లించావు."

సులక్షణ నవ్వింది ఆనందంగా.

